# ఒక్కడు

ఆ 'ఒక్కడు' మీరే ఎందుకు కాకూడదు?

డా॥ బి.వి.పట్టాభిరామ్ Ph.D

ఎమెస్కో

# విషయక్రమం


| | | |
|---|---|---|
| | కావలసింది సంకల్పం ........................................ | 5 |
| | లే! మేలుకో... లక్ష్యం సాధించేవరకు ఆగవద్దు ........................ | 7 |
| 1. | మీకేం తక్కువ ........................................ | 10 |
| 2. | పగటి కలలు నిజమవుతాయి ........................................ | 40 |
| 3. | మన తలరాత సృష్టికర్తలం మనమే ........................................ | 52 |
| 4. | గెలుపు రహస్యం ........................................ | 72 |
| 5. | మీ నిర్ణయం ఏమిటి? ........................................ | 102 |
| 6. | మంత్రాల్లాంటి మాటలు ........................................ | 118 |
| 7. | పదండి ముందుకు ........................................ | 152 |
| 8. | అసాధ్యం కాదు... అన్నీ సాధ్యమే! ........................................ | 184 |
| 9. | ఒక్కడు... ఆ 'ఒక్కడు' మీరే ఎందుకు కాకూడదు? ........................ | 202 |
| 10. | "ఒక్కడు" కావాలంటే "ఒత్తిడి" తప్పదు ........................................ | 229 |

ఈ ప్రపంచంలో ఎన్నో విజయాలు సాధించినవారిలాగానే మీరూ జన్మించారు. మీకు ఆలోచనాశక్తి వుంది. మీలో సృజన వుంది. మీలో పట్టుదల వుంది. మీ నరనరాల్లో ఆత్మవిశ్వాసం వుంది. మీ లక్ష్యం మీకు తెలుసు. లక్ష్యసాధనకు మార్గం మీకు తెలుసు. మీరు ఎన్నో విజయాలను సాధించారు. ఎన్నో పరాజయాల్ని ఎదుర్కొన్నారు. ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. మీకేం తక్కువ? మీరు శిఖరాగ్రానికి చేరే మార్గంలో వున్నారు. ముందుకు సాగండి. ముందుకు సాగిపోతూండండి. మీ లక్ష్యం మీకు కనబడుతుంది. కనుచూపుమేరలో కనబడుతుంది. మీరు లక్ష్యాన్ని సాధించగలరు.

# మీకేం తక్కువ!



ఎడారిలో ఒక కొంటె ఒంటెపిల్ల తల్లిని ఇలా అడిగిందట.

"అమ్మా మనపైన మూపురం ఎందుకు ఉంటుంది?"

"మనం ఎడారుల్లో మైళ్ళ తరబడి తిరుగుతాము కదా, కావలిసిన చోటల్లా నీళ్ళు దొరకవు. అందుకని మనం ఆ మూపురంలో నీళ్ళు నిలవ చేసుకుంటాము" అని చెప్పింది తల్లి.

"అమ్మా నువ్వు చెప్పింది బాగుంది. అన్ని జంతువుల్లా కాకుండా మనకాళ్ళు అంత పొడుగ్గా ఎందుకుంటాయమ్మా" అని మరో ప్రశ్న వేసింది.

"మనం ఎడారుల్లో మనుషుల్ని మీద కూర్చోపెట్టుకుని నడుస్తాం కదా! వాళ్ళ బరువు, మన బరువు కలిసి ఇసుకలో ఇరుక్కుపోతాయి, పొట్టి కాళ్ళయితే పైకి లాక్కోలేము, అందుకని పొడుగు కాళ్ళిచ్చాడు దేవుడు" అంది తల్లి.

"ఓహో అలాగా! మరైతే ఇంకో ప్రశ్న, మన కళ్ళకు అంత బరువైన కనురెప్పలు, వాటికి చాలా పొడుగైన వెంట్రుకలు ఎందుకున్నాయి?

"ఎందుకంటే మనం ఎప్పుడూ ఎడారుల్లోనే సంచరిస్తూ ఉంటాం కదా! గాలి దుమారాలు చెలరేగినపుడు కళ్ళలో ఇసుక పడకండా భగవంతుడు మనకు ఈ ప్రత్యేక ఏర్పాటు చేసాడు" అంది.

"మరేమనుకోకు మమ్మీ, మనం ఎడారుల్లో తిరగడానికి ఇన్ని ఏర్పాట్లు చేసుకుని ఒంటెలుగా పుడితే ఈ దిక్కుమాలిన మనుషులు మనల్ని ఈ సర్కసుల్లోనూ, ఊరేగింపుల్లోనూ, జంతుప్రదర్శనశాలల్లోనూ ఎందుకు ఉంచారమ్మా" అని మళ్ళీ ప్రశ్న వేసింది కొంటె ఒంటె.

"ఇలా చికాకు పెట్టే ప్రశ్నలడక్కు, నేను బిజీగా ఉన్నాను" అంటూ అప్పుడే జంతు ప్రదర్శనశాల చూడటానికి వచ్చిన పిల్లల వద్దకు వెళ్ళింది.

ప్రస్తుత పరిస్థితుల్లో కొంతమంది ఇలాగే సమస్యలొచ్చినప్పుడు పరిష్కారం తెలియక కొట్టుమిట్టాడుతున్నారు. నిజం చెప్పాలంటే, సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నవారే తమ బాధల్నే పెట్టుబడిగా భవిష్యత్తుని లాభాలుగా ఊహించుకుని నిర్విరామ, నిరంతర కృషి చేసి, అనుకున్నదానికన్నా అద్భుతాలు సాధించారు.

పెద్దపెద్ద కొండల్ని రాళ్ళుగా, శిల్పాలుగా మార్చేవ్యక్తి, మొదటిసారి ఆ కొండని చూసి బిత్తరపోడు. ఇది నా వలన సాధ్యమవుతుందా? అని కూడా అనుకోడు. పెద్దపని దొరికిందని మనసులో సంతోషిస్తాడని ఎంతమందికి తెలుసు. అతను సుత్తితో మొదటిదెబ్బ వేసినపుడు ఆ కొండ చెక్కుచెదరదు, కొంచెం మచ్చకూడా పడకపోవచ్చు, రెండవసారి, మూడవసారి... అలా కొడుతూనే ఉంటాడు. చివరకు సాధిస్తాడు. కొండను పిండి పిండి చేస్తాడు. ప్రతి వ్యక్తీ రాళ్ళు కొట్టే మనిషిని ఆదర్శంగా తీసుకోగలిగితే విజయం స్వంతం చేసుకోవచ్చు.



## ధీరులు - భీరువులు

భర్తృహరి సుభాషితాల్లో వీరి గురించి చక్కని పద్యం ఉంది. ఏనుగు లక్ష్మణకవి గారు అందంగా ఇలా అనువదించారు.

**కందుకము వోలె సుజనుడు**
**గ్రిందంబడి మగుడ మీదికి న్నెగయు సుమీ**
**మందుడు మృత్పిండము వలె**
**గ్రిందం బడి యడగియుండు గృపణత్వమునన్**

పిల్లలాడుకునే బంతి కింద పడగానే మరలపైకి ఎలా లేస్తుందో, అలాగే ధైర్యవంతులు, సజ్జనులు పొరపాటున క్రిందపడినా మళ్ళీ ధైర్యం తెచ్చుకుని, పైకి లేవగలుగుతారు, నిరాశ నిస్పృహలతో కుంగి పోరు. చివరకు ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారు. అటువంటి నిశ్చలమైన మనసుగలవారే ధీరులు, ఆరాధ్యులు. కాలం, ధర్మం అంటూ కూర్చోక, కావలసిన పనిమీదనే ధ్యానం పెట్టుకుని ముందుకు సాగుతారు. అగ్నితో భగభగమండుతున్న కాగడాని తల్లక్రిందులుగా పట్టుకున్నప్పటికీ దాని మంటలు పైకి మాత్రమే ఎగసిపడుతుంటాయి.

ఇక రెండవజాతి వారు ఆత్మవిశ్వాసం లేనివారు. ధైర్యం లేక చిన్నచిన్న సమస్యలకు కూడా బెదిరిపోతారు. ప్రతీ దానికి మీనమేషాలు లెక్కపడుతూ, ఇతరులమీద భారం వేస్తారు. లేదా పట్టువదలి కిందకు జారిపడతారు. అట్టివారికి అన్నీ అపజయాలే.